
తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శనివారం - 23 - మే - 2026 | సంపుటి : 3 | సంచిక : 355 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్ అరెస్ట్

## భారీ ఆస్తుల కేసులో ఏసీబీ దాడులు

11 ప్రాంతాల్లో సోదాలు.. కోట్ల విలువైన ఆస్తుల గుర్తింపు



**హైదరాబాద్, మే 22 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ -మల్కాజ్‌గిరి డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్టు చేశారు. అక్రమ ఆస్తుల కేసులో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి ఆయన కార్యాలయం సహా మొత్తం 11 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు విస్తృత సోదాలు నిర్వహించారు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో కూడా తనిఖీలు చేపట్టగా భారీ స్థాయిలో ఆస్తులు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఏసీబీ దర్యాప్తులో వంశీమోహన్‌కు చెందిన కోట్ల రూపాయల విలువైన ఆస్తులను గుర్తించినట్లు సమాచారం. మిగతా 2లో..

# 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

దేశ సగటును మించిన తెలంగాణ వృద్ధిరేటు

మహిళా సాధికారత, పారిశ్రామికాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

బ్యాంకులు రాష్ట్ర అభివృద్ధి భాగస్వాములుగా మారాలని పిలుపు

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2లో






# రైతుల సమస్యలపై కవిత ఆగ్రహం

సెక్రటేరియట్ ముందు వడ్లు పోసి నిరసన

కొనుగోళ్లలో ఆలస్యంపై ప్రభుత్వానికి హెచ్చరిక

రైతులను మోసం చేస్తున్నారంటూ విమర్శలు

**హైదరాబాద్, మే 22 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల గోస పట్టని ప్రభుత్వానికి బుద్ధి రావాలనే ఉద్దేశంతో సెక్రటేరియట్ ముందు నిరసన చేపట్టినట్లు తెలిపారు. తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో వడ్లు పోసి నిరసన తెలియజేసినట్లు వెల్లడించారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను కొనుగోలు చేసి వారికి అండగా నిలవాలనే బాధ్యత కూడా రాష్ట్ర ప్రభుత్వానికి లేకపోయిందని మండిపడ్డారు. మండుతున్న ఎండల కారణంగా రైతులు వడదెబ్బకు గురై కల్లాల్లోనే ప్రాణాలు కోల్పోతున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు అకాల వర్షాలతో తడిసిన ధాన్యం, మక్కలు, పొద్దుతిరుగుడు పువ్వు, జొన్నలను రైతులు ఆరబెడుతూ కొనుగోలు కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. కాంటా వేసే సిబ్బంది లేక రైతులు రోజుల తరబడి ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. మిగతా 2లో..





# ఇన్సూరెన్స్ డబ్బుల కోసం భార్య హత్య

- ఉరివేసుకున్నట్లు చిత్రీకరించిన భర్త
- ఖమ్మం జిల్లాలో కలకలం రేపిన ఘటన
- హత్య కోణంలో పోలీసుల విచారణ

**ఖమ్మం, మే 22 (తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం గోల్ తండాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఇన్సూరెన్స్ డబ్బుల కోసం ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను భర్తే హత్య చేశాడని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. హత్య అనంతరం ఆమె ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించి నిందితుడు పరారైనట్లు సమాచారం. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మృతురాలు మీనాక్షి, భర్త శివాజీ 14 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం మిగతా 2లో..

# జవహర్‌నగర్ డంప్‌యార్డ్‌పై ఈటల ఆందోళన

- కాలుష్యంతో ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో
- రాంకీ సంస్థపై తీవ్ర ఆరోపణలు
- శాశ్వత పరిష్కారం కోసం చర్యలు

**హైదరాబాద్, మే 22 (తెలంగాణ ముచ్చట్లు):** జవహర్‌నగర్ డంప్‌యార్డ్ సమస్యపై అఖిలపక్ష నాయకులు, ప్రభుత్వ అధికారులు, రాంకీ సంస్థ ప్రతినిధులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించినట్లు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన జవహర్‌నగర్ డంప్‌యార్డ్ వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ చరిత్రలోనే ఒకే ప్రాంతంలో పదివేల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయే పరిస్థితి ఎక్కడా లేదని విమర్శించారు. ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం చెత్తను పూర్తిస్థాయిలో రీసైకిల్ చేయాల్సి ఉండగా రాంకీ సంస్థ ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడం లేదని ఈటల రాజేందర్ ఆరోపించారు. ప్రతిరోజూ వచ్చే చెత్తలో సగం కూడా రీసైకిల్ చేయడం లేదన్నారు. దీని కారణంగా భారీగా చెత్త పేరుకుపోయి దానివల్ల వచ్చే కలుషిత నీరు భూగర్భ జలాల్లో కలుస్తోందని పేర్కొన్నారు. జవహర్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని చెరువులు పూర్తిగా నాశనమయ్యాయని, భూగర్భ జలాలు విషతుల్యమయ్యాయని ఈటల రాజేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. గాలి, నీరు, ధ్వని కాలుష్యాల ప్రభావంతో లక్షలాది మంది ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందన్నారు. గర్భిణీలకు గర్భస్రావాలు జరుగుతున్నాయని, పశుసంపద మరణిస్తోందని, ఈ ప్రాంతం మనుషులు మిగతా 2లో..



# వరి కొయ్యకాలు తగులబెట్టొద్దు

రైతులకు మంత్రి పొన్నం విజ్ఞప్తి

అగ్నిప్రమాదాలతో పెరుగుతున్న ప్రమాదాలు

ప్రత్యామ్నాయ పద్ధతులు పాటించాలని సూచన

2లో





# పోక్సో కేసులో ప్రభుత్వ వైఖరిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

- నిందితుడిని తొమ్మిది రోజుల పాటు కాపాడారని ఆరోపణలు
- ఆడబిడ్డకు న్యాయం జరగలేదని మండిపాటు

**హైదరాబాద్, మే 22 (తెలంగాణ ముచ్చట్లు):** పోక్సో కేసులో నిందితుడిని తొమ్మిది రోజుల పాటు దాచి ఉంచిన బాధ్యత పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానిదేనని కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మిగతా 2లో..



# కిడ్నీ మార్పిడుల్లో అరుదైన ఘనత సాధించిన నిమ్స్

- 2 వేల కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్లతో దేశంలోనే ప్రత్యేక గుర్తింపు
- నిమ్స్ వైద్య బృందానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు

**హైదరాబాద్, మే 22 (తెలంగాణ ముచ్చట్లు):** కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్లో అరుదైన మైలురాయిని అందుకున్న నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వైద్య బృందానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. నిమ్స్ యూరాలజీ విభాగం విజయవంతంగా మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

**హైదరాబాద్, మే 22 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో పాల్గొన్న ఆయన రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. సంక్షేమ పథకాలు, మహిళా సాధికారత, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మూసీ పునరుజ్జీవనం, గ్రామీణాభివృద్ధి వంటి అంశాలపై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, ఆర్బీఐ ప్రాంతీయ డైరెక్టర్ చిన్మయ్ మోహన్, ఎస్బీఐ సీఎంజీఎం నీలేష్ ద్వివేది తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో బ్యాంకుల పాత్ర కీలకమని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బ్యాంకులు కేవలం డిపాజిట్లు స్వీకరించే, రుణాలు ఇచ్చే సంస్థలుగానే కాకుండా రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధి భాగస్వాములుగా వ్యవహరించాలని సూచించారు.

ప్రస్తుతం దేశ సగటు వృద్ధిరేటు 8.2 శాతంగా ఉండగా తెలంగాణ 10.7 శాతం వృద్ధిరేటుతో ముందంజలో ఉందని భట్టి విక్రమార్క తెలిపారు. దేశ తలసరి ఆదాయం రూ.2.1 లక్షలు మాత్రమే ఉండగా తెలంగాణ తలసరి ఆదాయం రూ.4.18 లక్షలతో అగ్రస్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు రూ.9.43 లక్షల కోట్లకు, అడ్వాన్సులు రూ.12.34 లక్షల కోట్లకు చేరుకోవడం విశేషమన్నారు. 130.78 శాతం క్రెడిట్ డిపాజిట్ నిష్పత్తితో తెలంగాణ దేశంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందని పేర్కొన్నారు. వ్యవసాయం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రైతులు, పాడి రైతులు, మత్స్యకారులు, అనుబంధ రంగాలకు బ్యాంకులు మరింత సహకారం అందించాలని కోరారు. వ్యవసాయ రుణాల పంపిణీలో బ్యాంకులు లక్ష్యాలను మించి పనిచేయడం అభినందనీయమన్నారు. రూ.1,65,297 కోట్ల లక్ష్యానికి గాను రూ.1,68,401 కోట్ల వ్యవసాయ రుణాలు పంపిణీ చేయడం రాష్ట్ర బ్యాంకింగ్ వ్యవస్థ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.

విద్యార్థులకు ఇచ్చే విద్యారుణాలు భవిష్యత్తుపై పెట్టుబడులని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. యువతకు సానుకూల దృక్పథంతో రుణాలు అందించాలని బ్యాంకులకు సూచించారు. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళా పారిశ్రామికవేత్తలు, దళితులు, గిరిజన యువతకు మరింత రుణ సహాయం అందించాలని కోరారు. తెలంగాణ పారిశ్రామిక రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా పునరుత్పాదక ఇంధన రంగానికి ప్రాధాన్యం పెరుగుతోందని, తెలంగాణ కూడా సౌరశక్తి రంగంలో వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు. రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్, పర్యావరణహిత ప్రాజెక్టులకు బ్యాంకులు చురుకుగా రుణాలు ఇవ్వాలని సూచించారు. మూసీ నది పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, రీజినల్ రింగ్ రోడ్ పనులు ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలుగా కొనసాగుతున్నాయని వివరించారు. తెలంగాణలో వేగంగా పట్టణీకరణ జరుగుతోందని, దీని వల్ల సేవల రంగానికి భారీ అవకాశాలు ఉన్నాయని అన్నారు.

మహిళా ఆర్థిక సాధికారత కోసం స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే వడ్డీలేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి ప్రకటించారు. హైదరాబాద్ నగరంలో మహిళా సంఘాలకు రుణాల పంపిణీని యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నగరంలోని మురికివాడల మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహం అందించనున్నట్లు తెలిపారు. మహిళలు వ్యాపార, చిన్నతరహా పరిశ్రమల్లో ముందుకు రావాలని ప్రభుత్వం కోరుకుంటోందన్నారు. త్వరలో రాష్ట్రంలో అనేక ఇండస్ట్రియల్ హబ్‌లు, క్లస్టర్లు ఏర్పాటు చేయనున్నట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఫార్మా, ఫ్యాబ్ సిటీ, స్టీల్, లెదర్, టెక్స్‌టైల్ రంగాల్లో ప్రత్యేక పారిశ్రామిక మండలాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా తెలంగాణను దేశంలోనే అగ్రగామి ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమాంతరంగా తీసుకెళ్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# జవహర్‌నగర్ డంప్‌యార్డ్‌పై ఈటల ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

నివసించలేని స్థితికి చేరుకుందని పేర్కొన్నారు. డంప్‌యార్డ్ ఏర్పాటులో జీరో డిశ్చార్జ్, కాలుష్యం ఉండదనే నిబంధనలు పూర్తిగా ఉల్లంఘించబడినట్లు ఆరోపించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు తక్షణ చర్యలు అవసరమని అన్నారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డితో కూడా చర్చించినట్లు వెల్లడించారు. జవహర్‌నగర్ డంప్‌యార్డ్ సమస్యపై ముఖ్యమంత్రికి పూర్తి అవగాహన ఉందని చెప్పారు. అఖిలపక్ష నాయకులు, ప్రభుత్వ అధికారులు, రాంకీ ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నామని ఈటల తెలిపారు. కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డితో కలిసి డంప్‌యార్డ్ పరిస్థితిని పరిశీలించినట్లు చెప్పారు. సమస్యపై మూడు రోజుల్లో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఆ నివేదిక ఆధారంగా ముఖ్యమంత్రితో సమావేశమై శాశ్వత పరిష్కారంపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఒకే ప్రాంతంలో భారీగా చెత్త వేయడం కాకుండా వివిధ ప్రాంతాల్లో చెత్త నిర్వహణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని పరిశీలిస్తున్నట్లు ఈటల రాజేందర్ తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని శాశ్వత పరిష్కారం అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. జవహర్‌నగర్ డంప్‌యార్డ్ సమస్యపై భారతీయ జనతా పార్టీ అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తోందని, అవసరమైతే కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కూడా తీసుకుంటామని స్పష్టం చేశారు.

# వరి కొయ్యకాలు తగులబెట్టొద్దు

**హైదరాబాద్, మే 22 (తెలంగాణ ముచ్చట్లు):** వరి కోతల అనంతరం వరి, మొక్కజొన్న కొయ్యకాలకు నిప్పు పెట్టవద్దని రైతులకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. కొయ్యకాలు తగులబెట్టడం వల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి, రైతుల ఆస్తులకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండలం గుంటూరుపల్లెలో జరిగిన అగ్నిప్రమాద ఘటనను ప్రస్తావిస్తూ రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. గుంటూరుపల్లెలో వరి కొయ్యకాలకు నిప్పు పెట్టడంతో గాలికి మంటలు వేగంగా వ్యాపించి గడ్డి కట్టలతో వెళ్తున్న ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైన ఘటన దురదృష్టకరమని మంత్రి తెలిపారు. అలాగే రవాణా శాఖ బీట్ రిపోర్టర్ వెంకన్న తండ్రి నూనెముంతల సత్తయ్య వరి కొయ్యకాలకు నిప్పు పెడుతుండగా మంటలు చెలరేగి పొగ కారణంగా ఊపిరాడక మృతి చెందడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు మరెవరికీ జరగకూడదని పేర్కొన్నారు. వరి కొయ్యకాలు తగులబెట్టడం వల్ల నేలలోని సేంద్రియ పదార్థాలు, ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నాశనం అవుతాయని మంత్రి వివరించారు. దీని వల్ల భూసార శక్తి తగ్గిపోయి భవిష్యత్తులో పంట దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. గాలి కాలుష్యం పెరిగి ప్రజల్లో శ్వాసకోశ సమస్యలు, ఇతర ఆరోగ్య ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. అంతేకాకుండా పక్క పొలాలు, చెట్లు, విద్యుత్ లైన్లకు కూడా అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. వేగంగా వ్యాపించే మంటల వల్ల రైతులు ఆస్తి నష్టాలతో పాటు ప్రాణనష్టాలు కూడా ఎదుర్కొనే పరిస్థితులు వస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో వడగాలులు కారణంగా అగ్నిప్రమాదాలు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయని తెలిపారు. రైతులు వరి పరకను ట్రాక్టర్ల ద్వారా నేలలో కలపడం, పశువుల మేతగా వినియోగించడం, కంపోస్ట్ లేదా సేంద్రియ ఎరువుల తయారీలో ఉపయోగించడం వంటి ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని మంత్రి సూచించారు. అదేవిధంగా మష్రూమ్ పెంపకం, బేలర్ యంత్రాల ద్వారా సేకరించి విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. వ్యవసాయ శాఖ కూడా పరక కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను ప్రోత్సహిస్తోందని మంత్రి తెలిపారు. రైతులు బాధ్యతాయుతంగా వ్యవహరించి అగ్నిప్రమాదాలను నివారించాలని విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భూసారాన్ని కాపాడేందుకు రైతులు సహకరించాలని పిలుపునిచ్చారు.

# కిడ్నీ మార్పిడుల్లో అరుదైన ఘనత సాధించిన నిమ్స్

(మొదటి పేజీ తరువాయి)

2 వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తి చేసి దేశవ్యాప్తంగా అరుదైన రికార్డు నమోదు చేసింది. కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న వేలాది మంది రోగులకు నూతన జీవితం అందించిన నిమ్స్ వైద్య సేవలు ప్రశంసనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ల నిర్వహణలో దక్షిణ భారతదేశంలో నిమ్స్ మొదటి స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా గుజరాత్‌లోని ఐకేడీఆర్‌సీ మొదటి స్థానంలో, లూధియానాలోని క్రిస్టియన్ మెడికల్ కాలేజీ రెండో స్థానంలో ఉండగా, నిమ్స్ మూడో స్థానంలో నిలిచి విశిష్ట గుర్తింపు పొందింది. ప్రభుత్వ వైద్య సంస్థగా ఇంత పెద్ద స్థాయిలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించడం వైద్య రంగంలో గొప్ప విజయంగా భావిస్తున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, నిమ్స్ వైద్యులు, సిబ్బంది అంకితభావంతో సేవలు అందిస్తూ కిడ్నీ బాధితులకు ఆశాకిరణంగా నిలుస్తున్నారని అన్నారు. ఆధునిక వైద్య సాంకేతికత, నిపుణులైన వైద్య బృందం, ప్రభుత్వ మద్దతుతో నిమ్స్ దేశంలోనే ప్రముఖ వైద్య సంస్థగా ఎదుగుతోందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంలో తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.

2 వేల కిడ్నీ మార్పిడి పొందిన రోగుల్లో 95 శాతం మంది అంటే దాదాపు 1,900 మంది వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా చికిత్స పొందడం విశేషం. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఈ పథకాలు పెద్ద ఊరటనిస్తున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వ వైద్య సేవల ద్వారా పేదలకు ఖరీదైన శస్త్రచికిత్సలు అందుబాటులోకి రావడం ఆరోగ్యరంగంలో కీలక ముందడుగుగా భావిస్తున్నారు. నిమ్స్ యూరాలజీ విభాగం గత మూడేళ్ల నాలుగు నెలల్లోనే 500 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తి చేసి మరో రికార్డు సృష్టించింది. 2023 జనవరి నుంచి వేగవంతంగా ట్రాన్స్‌ప్లాంట్లు నిర్వహిస్తూ వైద్య సేవల విస్తరణలో కొత్త ప్రమాణాలు సృష్టిస్తోంది. కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు సమయానుకూలంగా చికిత్స అందించడంలో నిమ్స్ కీలక పాత్ర పోషిస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహం, ఆధునిక సదుపాయాలు, వైద్యుల నైపుణ్యం కలిసివచ్చి నిమ్స్‌ను దేశంలోని ప్రముఖ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ కేంద్రాల్లో ఒకటిగా నిలబెట్టాయి. భవిష్యత్తులో మరిన్ని అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అధికారులు తెలిపారు.

# రైతుల సమస్యలపై కవిత ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

కొనుగోలు కేంద్రాల్లో తూకాల్లో తరుగు తీస్తున్నారని, తేమ పేరుతో కొనుగోళ్లను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారని విమర్శించారు. ఏ గ్రేడ్ ధాన్యాన్ని బి గ్రేడ్‌గా చూపిస్తూ మిల్లర్లు రైతులను మోసం చేస్తున్నారని, ఈ వ్యవహారాలను పర్యవేక్షించే అధికారులు కూడా పట్టించుకోవడం లేదని అన్నారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రెండున్నరేళ్లుగా వ్యవసాయ శాఖపై సమీక్ష నిర్వహించని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రాష్ట్రానికి పట్టిన దరిద్రమని కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. పండిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేయాలని తెలంగాణ రక్షణ సేన తరఫున డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. ఇవాళ సెక్రటేరియట్ ముందు చేపట్టిన నిరసన కేవలం శాంపిల్ మాత్రమేనని కవిత హెచ్చరించారు. వానలు పడేలోపు కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేయకపోతే తెలంగాణ రక్షణ సేన మరింత తీవ్రంగా ఉద్యమంలోకి దిగుతుందని స్పష్టం చేశారు. రైతులను ఇబ్బంది పెట్టే పరిస్థితులు కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతుల సమస్యలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. కొనుగోళ్లలో పారదర్శకత తీసుకురావాలని, మిల్లర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. రైతులకు న్యాయం జరగకపోతే మంత్రులు, ఎమ్మెల్యేలు తెలంగాణలో తిరగలేని పరిస్థితి వస్తుందని హెచ్చరిస్తూ ప్రభుత్వం తక్షణమే స్పందించాలని సూచించారు.

# డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్ అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

వనస్థలిపురం, మణికొండ, మజీద్‌కొండ ప్రాంతాల్లో రూ.4.46 కోట్ల విలువైన 19 ఓపెన్ ప్లాట్లను అధికారులు గుర్తించారు. అదనంగా రూ.1.2 కోట్ల విలువైన మూడు ఇళ్లు కూడా ఉన్నట్లు దర్యాప్తులో బయటపడింది. ఇబ్రహీంపట్నం పరిధిలోని నారపల్లి వద్ద రెండు ఎకరాల్లో నిర్మించిన ఫామ్ హౌస్ కూడా వంశీమోహన్‌కు చెందినదిగా ఏసీబీ అధికారులు గుర్తించారు. గతంలో శేరిలింగంపల్లి, ఇతర ప్రాంతాల్లో ఆర్డీవోగా పనిచేసిన సమయంలో ప్రభుత్వ భూములను అక్రమంగా స్వాధీనం చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయని అధికారులు తెలిపారు. అబ్దుల్లాపూర్‌మెట్, పిగ్లీపురం ప్రాంతాల్లో సుమారు ఎనిమిది ఎకరాల భూమిని ఆక్రమించినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఈ భూములను మొదట తన మామ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి, అనంతరం రియల్టర్లకు బదిలీ చేసినట్లు ఏసీబీ అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో పలు ఆర్థిక లావాదేవీలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా ఒక రియల్టర్ నుంచి పది ప్లాట్లను గిఫ్ట్ డీడ్ రూపంలో తీసుకున్నట్లు ఏసీబీ గుర్తించింది. ప్రభుత్వ పదవిని దుర్వినియోగం చేసి అక్రమంగా ఆస్తులు కూడబెట్టినట్లు ప్రాథమిక ఆధారాలు లభించడంతో వంశీమోహన్‌ను అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఆస్తుల విలువ, ఆర్థిక లావాదేవీలపై మరింత లోతైన దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ వెల్లడించింది. అక్రమ ఆస్తుల మొత్తం విలువ ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. కేసుకు సంబంధించి మరికొంతమందిపై కూడా విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం.

# ఇన్సూరెన్స్ డబ్బుల కోసం భార్య హత్య

(మొదటి పేజీ తరువాయి)

చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడు స్టేజ్ సమీపంలోని గోల్ తండాలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నారు. బయటకు సాధారణ కుటుంబంలా కనిపించినా, ఇంట్లో తరచూ గొడవలు జరిగేవని బంధువులు చెబుతున్నారు. ఇటీవల ఇంటిపై సుమారు రూ.80 లక్షల రుణభారం ఉందని, మీనాక్షి పేరుపై కోటి రూపాయల ఇన్సూరెన్స్ పాలసీ ఉండటంతో డబ్బుల కోసం ఈ హత్య జరిగి ఉండొచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇన్సూరెన్స్ క్లెయిమ్ కోసం భార్యను చిత్రహింసలకు గురిచేసి చివరకు హత్య చేశాడని ఆరోపిస్తున్నారు. గతంలో కూడా శివాజీ తన భార్యపై దాడి చేసిన ఘటనలు ఉన్నాయని చెబుతున్నారు. మీనాక్షిని కిందపడేసి పిడిగుద్దులతో కొట్టిన దృశ్యాలను బంధువులు బయటపెట్టారు. భర్త తరచూ ఆమెను హింసించేవాడని, అతడి ప్రవర్తన చాలా దారుణంగా ఉండేదని ఆరోపిస్తున్నారు. కుటుంబ కలహాల పేరుతో సంవత్సరాలుగా ఆమె మానసిక, శారీరక వేధింపులు ఎదుర్కొంటున్నట్లు మృతురాలి బంధువులు తెలిపారు. ఈరోజు మీనాక్షి అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా, భర్త శివాజీ ఆమె ఉరివేసుకొని చనిపోయినట్లు చిత్రీకరించి అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. ఇన్సూరెన్స్ డబ్బుల కోసమే ఈ హత్య జరిగిందా లేదా మరేదైనా వ్యక్తిగత కారణం ఉందా అనే దానిపై సమగ్ర విచారణ జరపాలని మృతురాలి కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ ఘటనతో గోల్ తండాలో విషాద వాతావరణం నెలకొంది.

# ..ప్రభుత్వ వైఖరిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

మధ్య ఉన్న అనుబంధం వల్లే బాధిత బాలికకు అన్యాయం జరిగిందని విమర్శించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ వ్యవహారంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనర్ బాలిక తనకు అన్యాయం జరిగిందని కుటుంబ సభ్యులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్తే అర్ధరాత్రి వరకు నిలబెట్టి వేధించారని కేటీఆర్ ఆరోపించారు. నిందితుడిని అరెస్ట్ చేయకుండా తొమ్మిది రోజుల పాటు కాపాడిందీ రాష్ట్ర ప్రభుత్వమేనన్నారు. తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా మహిళలు తీవ్రంగా స్పందించడంతోనే చివరికి ప్రభుత్వం దిక్కుతోచని పరిస్థితుల్లో అరెస్ట్ చేసిందని పేర్కొన్నారు. హైకోర్టు బెయిల్ ఇవ్వబోదని స్పష్టం చేసిన తర్వాతే చర్యలు తీసుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రధానమంత్రి పర్యటన కారణంగా పోలీసులు బిజీగా ఉన్నారని ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. "ప్రధానమంత్రి వస్తే మూడు రోజుల పాటు నేరస్థులు స్వేచ్ఛగా తిరగాలా?" అని ప్రశ్నించారు. రాష్ట్ర హోంశాఖకు బాధ్యుడైన ముఖ్యమంత్రి ఇలాంటి సాకులు చెప్పడం బాధాకరమన్నారు. పోక్సో కేసు వంటి సున్నితమైన అంశంపై తాము ఇప్పటి వరకు రాజకీయాలు చేయలేదని కేటీఆర్ తెలిపారు. కానీ ముఖ్యమంత్రి తమపై విమర్శలు చేయడంతో స్పందించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. దేశంలో ఎక్కడైనా పోక్సో కేసు నిందితుడు తొమ్మిది రోజుల పాటు తప్పించుకొని తిరిగిన ఉదాహరణ ఉందా అని ప్రశ్నించారు. కేవలం అధికార అండదండల వల్లే నిందితుడు తప్పించుకున్నాడని ఆరోపించారు.

బాధిత కుటుంబంపై 'హనీ ట్రాప్' పేరుతో కౌంటర్ కేసులు పెట్టడం వెనుక ఎవరు ఉన్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి సన్నిహితుల ఆసుపత్రిలో నిందితుడిని దాచిపెట్టారనే వార్తలపై విచారణ జరపాలని కోరారు. ఒకవైపు తన కుమారుడికి సంబంధం లేదని కోర్టులో చెప్పి, మరోవైపు తానే పోలీసులకు అప్పగించానని చెప్పడం ఎలా సాధ్యమో బండి సంజయ్ సమాధానం చెప్పాలని అన్నారు. ఈ వ్యవహారంలో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని, మీడియాను అప్రమత్తం చేస్తూ ముందుకు వెళ్లారని కేటీఆర్ ప్రశంసించారు. ఆయనపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రాష్ట్రంలో ఆడబిడ్డలకు అన్యాయం జరిగిన ప్రతిసారి తామే పోరాడామని, భవిష్యత్తులో కూడా బాధితులకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో మీడియా పాత్రపైనా కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. "హనీ ట్రాప్" అంటూ వార్తలు రాయించిన వ్యక్తులు ఎవరో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి మీడియా సంస్థలకు ఫోన్ చేసి వార్తలు ఆపించారని వస్తున్న ఆరోపణలపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. నేరస్థుడు ఎవడైనా నేరస్థుడేనని, అధికారంలో ఉన్నవారికి ప్రత్యేక రక్షణ ఉండకూడదని కేటీఆర్ స్పష్టం చేశారు.

## జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన పెద్దమందడి విద్యార్థులకు ఘన సత్కారం



**పెద్దమందడి,మే22(తెలంగాణ ముచ్చట్లు):** 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి పాలన విద్యా వారోత్సవాల ముగింపు సందర్భంగా వనపర్తి ఐడిఓసి కాంప్లెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జడ్‌పి హెచ్‌ఎస్ పెద్దమందడి పాఠశాల విద్యార్థులు విశిష్ట ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో గుర్తింపు పొందారు. పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థిని కొమ్ము చందనకు, హాకీలో జాతీయ స్థాయిలో పాల్గొని ప్రతిభ చాటిన విద్యార్థిని అంజలికి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, డీఈఓ అబ్దుల్ గని ప్రశంసా పత్రంతో పాటు రూ.10 వేల నగదు పురస్కారం అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతన్న, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు.భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, జిల్లా స్థాయిలో విద్యార్థులు ప్రతిభ కనబరచడం పాఠశాలకు గర్వకారణమని తెలిపారు.

## ఆసరా పెన్షన్ లబ్ధిదారులు లైవ్ ఫోటో క్యాప్చర్ తప్పనిసరిగా చేసుకోవాలి



◆ వెంకటస్వామి వెల్టూర్ గ్రామ పంచాయితీ కార్యదర్శి

**పెద్దమందడి,మే22(తెలంగాణ ముచ్చట్లు):** ఆసరా పెన్షన్ పొందుతున్న లబ్ధిదారులు తప్పనిసరిగా లైవ్ ఫోటో క్యాప్చర్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి తెలిపారు.ఆసరా పెన్షన్ పొందుతున్న ప్రతి ఒక్కరూ తమ ఆధార్ కార్డుతో ఉదయం 10 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆయన సూచించారు. ఆసరా పెన్షన్ పోర్టల్‌లో లబ్ధిదారుల ప్రత్యక్ష ఫోటో నమోదు (లైవ్ ఫోటో క్యాప్చర్) చేపడుతున్నందున, పెన్షన్ పొందుతున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ ప్రక్రియలో పాల్గొని పూర్తి చేసుకోవాల్సి ఉందన్నారు.జూన్ 1వ తేదీలోపు లైవ్ ఫోటో క్యాప్చర్ చేయించుకోని లబ్ధిదారుల పెన్షన్ నిలిపివేయబడే అవకాశం ఉన్నందున,ఈ విషయాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని సంబంధిత ప్రతి ఒక్కరూ నిర్ణీత సమయంలో గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చి ప్రక్రియ పూర్తి చేసుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి కోరారు.

## గ్రామస్తులతో కలిసి మంటలను ఆర్పిన సర్పంచ్ సంపత్



**ఎల్కతుర్తి ,మే22 (తెలంగాణ ముచ్చట్లు)** : ఎల్కతుర్తి మండలంలోని దండేపల్లి గ్రామ పరిధిలోని నైనేని ఆంజనేయరావు గారి వ్యవసాయ పొలం వద్ద, చర్చ్ సమీపంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. ఎండల తీవ్రత, వడగాడ్పు ప్రభావంతో మంటలు వేగంగా వ్యాపిస్తూ పక్కనే ఉన్న పొలాలు, గడ్డివాములకు ముప్పుగా మారాయి. దీంతో స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు.

అయితే ఫైర్ ఇంజన్ ఆలస్యంగా వచ్చే పరిస్థితి ఉండటంతో మంటలు మరింత విస్తరించే ప్రమాదాన్ని గుర్తించిన దండేపల్లి గ్రామ సర్పంచ్ గొలిపెల్లి సంపత్ వెంటనే అప్రమత్తమయ్యారు. గ్రామ పంచాయతీకి చెందిన నీటి ట్యాంకర్‌ను సంఘటనా స్థలానికి తరలించి సహాయక చర్యలు ప్రారంభించారు.

సర్పంచ్ సంపత్ స్వయంగా అక్కడే ఉండి గ్రామస్తులు, యువకులతో కలిసి ట్యాంకర్ పైపు ద్వారా నీటిని చల్లుతూ మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అందరి సమిష్టి కృషితో మంటలు పూర్తిగా ఆరిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామ ప్రజలు తెలిపారు.

సర్పంచ్ గొలిపెల్లి సంపత్ సమయస్ఫూర్తితో స్పందించి గ్రామస్తులతో కలిసి మంటలను అదుపు చేయడం పట్ల గ్రామ ప్రజలు అభినందనలు తెలియజేస్తూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

# విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై బాధిత రైతుల ఆగ్రహం





**ఎల్కతుర్తి, మే 22 (తెలంగాణ ముచ్చట్లు):**
హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం పరిధిలోని దండేపల్లి గ్రామం లో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గ్రామంలో లూజుగా ఉన్న కరెంటు తీగలు ఒకదానికొకటి తగలడంతో స్పార్కులు ఏర్పడి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో దాదాపు 20 ఎకరాల వరి గడ్డి కాలిపోగా, సుమారు 50 మామిడి చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. బాధిత రైతు వద్దెల్లి అన్నారావు మాట్లాడుతూ గ్రామంలో చాలా చోట్ల విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయని, పలుమార్లు అధికారులకు తెలియజేసినా స్పందించలేదని ఆరోపించారు. వేసవి కాలంలో తీగల రాపిడి కారణంగా స్పార్కులు ఏర్పడి మంటలు వ్యాపిస్తున్నాయని తెలిపారు. ఈ ప్రమాదంతో తీవ్ర నష్టం వాటిల్లిందని, విద్యుత్ శాఖ నిర్లక్ష్యమే ఘటనకు కారణమని గ్రామ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకుని ఆర్థిక సహాయం అందించాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

# సమాజ సేవకుడు భాగ్యరెడ్డి వర్మ సేవలు చిరస్మరణీయం



**హుజురాబాద్,మే 22(తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ మున్సిపల్ కార్యాలయంలో శ్రీ ఎం.వి భాగ్యరెడ్డి వర్మ గారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని పాల్గొని భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలతో జయంతి వేడుక చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి భాగ్యరెడ్డి వర్మ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ కిషన్ , మేనేజర్ భూపాల్ రెడ్డి , రమేష్, కిరణ్ , వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, ఆఫీస్ సిబ్బంది, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## శ్రీనివాస్ శర్మ కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**పెద్దమందడి,మే22(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షులు జి. సతీష్ శర్మ గారి తండ్రి, రిటైర్డ్ ఉపాధ్యాయులు శ్రీనివాస్ శర్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శుక్రవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన మాజీమంత్రి నిరంజన్ రెడ్డి, కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో వారి కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.మాజీ మంత్రి వెంట గ్రామ సర్పంచ్ అశోక్, మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వేణు యాదవ్, రఘువర్ధన్ రెడ్డి, భూషయ్య, నరేష్, ఖాజా హుస్సేన్, రమేష్, కృష్ణారెడ్డి, సంజీవ రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో ఆకస్మిక తనిఖీ

◆ వైద్య సేవలను మెరుగుపరచాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సూచన

**హుజురాబాద్, మే22(తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ మండలంలోని సిర్సపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రావణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఎన్ సీడీ రిజిస్టర్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి రికార్డుల నిర్వహణ తీరును తెలుసుకున్నారు. ఆసుపత్రి సిబ్బంది పని తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆరోగ్య సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు. రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి సమయానికి చికిత్స అందించాలని వైద్య సిబ్బందికి తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ ప్రత్యూష, సిబ్బంది సదానందం, ప్రతాప్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## సమాజ సేవకుడికి "దళిత రత్న" పురస్కారం

**ఎల్కతుర్తి, మే 22( తెలంగాణ ముచ్చట్లు):** సామాజిక సేవా కార్యక్రమాల్లో విశేష కృషి చేస్తున్న సామాజిక కార్యకర్త గొర్రె మహేందర్‌కు ప్రతిష్టాత్మక "దళిత రత్న" పురస్కారం లభించింది. 202526సంవత్సరానికి గాను మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ఈ అవార్డును ప్రదానం చేసింది. శుక్రవారం హనుమకొండలో జరిగిన కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనుగాల వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా గొర్రె మహేందర్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా గొర్రె మహేందర్ మాట్లాడుతూ, తన సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసిన మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ గౌరవం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా దళితుల అభ్యున్నతి, సామాజిక న్యాయం, హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సామాజిక కార్యకర్తలు, అభిమానులు పాల్గొని గొర్రె మహేందర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగ

**హైదరాబాద్, అమరావతి, మే 22 (తెలంగాణ ముచ్చట్లు):** తెలుగు రాష్ట్రాల్లో ఎండలు భగ్గుమంటున్నాయి. భానుడి ప్రతాపానికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం నుంచే మండిపోతున్న ఎండలు మధ్యాహ్నానికి అగ్నిగుండంలా మారుతున్నాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం సమయంలో బయటకు రావొద్దని ప్రజలకు సూచించింది. తెలంగాణ రాష్ట్రంలో వడదెబ్బ తీవ్రత ఆందోళన కలిగిస్తోంది. ఒక్క రోజులోనే వడదెబ్బ కారణంగా 22 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. రోహిణికార్తె మొదలుకాకముందే రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖమ్మం జిల్లాలో అత్యధికంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిజామాబాద్, ఆదిలాబాద్, హన్మకొండ, రామగుండం, భద్రాచలం ప్రాంతాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కూడా వడగాలులు ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. నగరంలో 42 నుంచి 43 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉక్కపోత, వేడి గాలులతో ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎండలు విపరీతంగా పెరిగాయి. పల్నాడు జిల్లాలో నిన్న 48 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. పిడుగురాళ్ల ప్రాంతంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. బాపట్ల జిల్లా వేటపాలెం, ప్రకాశం జిల్లా అద్దంకి ప్రాంతాల్లో 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా, మరో 150 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.వైద్య నిపుణులు ప్రజలకు పలు జాగ్రత్తలు సూచిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లకుండా ఉండాలని, తగినంత నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ తీసుకోవాలని సూచిస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# గ్రామ బహిష్కరణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి



- బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్

**పెద్దమందడి,మే22(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి, బలిసపల్లి గ్రామంలో బహిష్కరణ పేరుతో సామాజికంగా దూరం పెట్టిన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు.శుక్రవారం పెద్దమందడి మండలంలో మీడియాతో మాట్లాడిన ఆయన, బీసీ, ఎస్సీ, ఎస్టీలపై ఇంకా కుల వివక్ష కొనసాగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మండల కేంద్రం ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో జంట గ్రామాలైన బలిజపల్లి,జంగమయ్యపల్లిని గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే మేఘా రెడ్డి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి లేఖ రాయగా, కలెక్టర్ తదుపరి చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. అయితే అప్పట్లో కొందరు తమ గ్రామాలను మండల కేంద్రంగా చేయవద్దని ధర్నాలు చేసినప్పటికీ, పోలీసులు, అధికారులు ఎలాంటి ఆంక్షలు విధించకుండా ప్రశాంతంగా నిరసనలు చేసుకునే అవకాశం కల్పించారని గుర్తు చేశారు.ఇటీవల జంట గ్రామాల్లో జరగనున్న బొడ్రాయి పండుగ సందర్భంగా, మండల కేంద్రం కోసం ప్రయత్నించిన తొమ్మిది మందిని గ్రామ ఆధిపత్య వర్గాలకు చెందిన వ్యక్తులు గ్రామ బహిష్కరణకు గురిచేయడం అన్యాయమని ఆయన ఆరోపించారు.పండుగ అవసరాల కోసం గ్రామస్తులు చందాలు సేకరించే క్రమంలో ఈ తొమ్మిది మంది నుంచి డబ్బులు తీసుకోవద్దని చెప్పి, వారిలోని అగ్రవర్ణానికి చెందిన ఒక వ్యక్తి నుంచి మాత్రం చందాలు స్వీకరించడం కుల దురహంకారానికి నిదర్శనమని విమర్శించారు.స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ కుల వివక్ష కొనసాగుతుండటం దురదృష్టకరమని, అంతేకాకుండా ఈ తొమ్మిది మందిపై దాడి చేసే కుట్ర జరగడం ఆందోళనకరమని అన్నారు. గ్రామాన్ని మండల కేంద్రంగా చేయాలని కోరుకోవడం తప్పా? అని ప్రశ్నించిన ఆయన, 9 మందిలో ఒకరైన రమేష్ గౌడ్ గతంలో రెండు పర్యాయాలు సర్పంచిగా, ఒకసారి జెడ్పిటిసి సభ్యునిగా సేవలందించారని గుర్తు చేశారు.మండల కేంద్రం ఆమోదం కోసం ఎమ్మెల్యే లేఖ రాసిన నేపథ్యంలో గ్రామస్తులు ప్రశాంతంగా ఉన్నప్పటికీ, ఆ ప్రక్రియ కోసం ప్రయత్నించిన తొమ్మిది మందిని ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.అధికార పార్టీకి చెందిన నాయకులకే ఇలాంటి పరిస్థితి ఎదురైతే సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో ప్రజలు ఆలోచించాలని అన్నారు.తప్పును ప్రశ్నించిన వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం అగ్రవర్ణ దురహంకారానికి నిదర్శనమని విమర్శించిన ఆయన, ప్రతిపక్ష నాయకులు, మాజీ మంత్రి కుటుంబ సభ్యులు ధర్నాలు చేస్తే అనుమతులు ఇచ్చే పోలీసులు, ఈ విషయంలో ఎందుకు కఠినంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.వనపర్తి జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా గాడి తప్పుతోందని ఆరోపించిన ఆయన, బీసీ, ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, కుల వివక్ష ఘటనలపై ఎస్సీ కమిషన్, బీసీ కమిషన్, మానవ హక్కుల సంఘాలకు ఫిర్యాదు చేస్తామని, అవసరమైతే ఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల సంఘాన్ని కూడా ఆశ్రయిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యుడు రమేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ చీర్ల విజయ్ చందర్, బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వీవీ గౌడ్, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు శివ నాయక్ పాల్గొన్నారు.

# ప్రజాధనాన్ని వృథా చేస్తున్న నిర్లక్ష్య కాంట్రాక్టర్



- ఇంద్రనగర్ గ్రామ సర్పంచ్ అంబాల రాజు

**ఎల్కతుర్తి , మే 22 (తెలంగాణ ముచ్చట్లు):** ఇందిరానగర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న నూతన గ్రామపంచాయతీ భవన పనులను నిర్లక్ష్యంగా కొనసాగిస్తూ ప్రజాధనాన్ని వృథా చేస్తున్న కాంట్రాక్టర్‌పై గ్రామ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు సంవత్సరాల క్రితం ప్రారంభమైన భవన నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో గ్రామ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

శుక్రవారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఇందిరానగర్ గ్రామ సర్పంచ్ అంబాల రాజు మాట్లాడుతూ, మాజీ హుస్నాబాద్ శాసనసభ్యులు వోడితల సతీష్ కుమార్ ప్రత్యేక చొరవతో గ్రామానికి నూతన గ్రామపంచాయతీ భవనం మంజూరైందన్నారు. అయితే టెండర్ పొందిన కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేసి పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు.

గ్రామపంచాయతీ కార్యాలయం లేకపోవడంతో ప్రజలకు అవసరమైన ధృవపత్రాలు, సంక్షేమ పథకాల సేవలు అందించడంలో తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం కార్యాలయం నిర్వహించేందుకు గ్రామంలో సరైన భవనం కూడా లేక ప్రజాప్రతినిధులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

ప్రస్తుత కాంట్రాక్టర్‌పై తక్షణ చర్యలు తీసుకొని టెండర్ రద్దు చేసి కొత్త కాంట్రాక్టర్‌కు నిర్మాణ బాధ్యతలు అప్పగించాలని సర్పంచ్ అంబాల రాజు డిమాండ్ చేశారు. గ్రామ ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని అధికారులు వెంటనే స్పందించి గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యునిగా రాజేష్ ఠాకూర్ నియామకం





**జమ్మికుంట టౌన్ మే 22 (తెలంగాణ ముచ్చట్లు):** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యునిగా కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణానికి చెందిన రాజేష్ ఠాకూర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ రాష్ట్ర, జిల్లా అగ్ర నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.


తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి మరియు కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్, రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు క్రాంతి కిరణ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా రాజేష్ ఠాకూర్ మాట్లాడుతూ.. పార్టీ అగ్రనాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ బలోపేతానికి, ఎస్సీ సామాజిక వర్గ సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం ప్రజల మధ్య ఉంటానని పేర్కొన్నారు.

తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# జమ్మికుంట పోలీసుల చాకచక్యం.. 24 గంటల్లోనే నిందితుల అరెస్ట్





**జమ్మికుంట టౌన్ మే 22 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామ రహదారిపై జరిగిన దోపిడీ ఘటనను జమ్మికుంట పోలీసులు కేవలం 24 గంటల్లోనే ఛేదించి ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని ఏసీపీ మాధవి గురువారం జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

మే 20 రాత్రి కోరపల్లి గ్రామం వైపు నుంచి వస్తున్న అశోక్ లేలాండ్ వాహనం (టీఎస్ 08 యూడీ 5457)ను 11 మంది గుర్తు తెలియని వ్యక్తులు అడ్డగించి, అందులో ప్రయాణిస్తున్న ఇద్దరిపై దాడికి పాల్పడ్డారు. అనంతరం బాధితులను ఎఫ్‌సీఐ గోదాం సమీపంలోని ఖాళీ ప్రదేశానికి తీసుకెళ్లి బెదిరించి నగదు, బంగారం ఉంగరం దోచుకున్నారు. అదేవిధంగా ఫోన్‌పే ద్వారా సుమారు రూ.38 వేల వరకు బలవంతంగా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు.

ఇంకా మరో లక్ష రూపాయలు ఇవ్వాలని బాధితులను బెదిరిస్తూ రైల్వే స్టేషన్ వైపు తీసుకెళ్తుండగా, బాధితులు గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. దీంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. ఘటనపై సమాచారం అందుకున్న జమ్మికుంట పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. మే 21 ఉదయం సైదాబాద్ ఎక్స్‌రోడ్-కోరపల్లి వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఎనిమిది మందిని పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. విచారణలో వారు నేరాన్ని అంగీకరించినట్లు ఏసీపీ తెలిపారు.

నిందితుల వద్ద నుంచి రూ.14 వేల నగదు, అర తులం బంగారం ఉంగరం, నాలుగు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో పల్లపు ఈశ్వర్ అలియాస్ బన్నీ, పల్లపు అశోక్, ఎలకపల్లి ప్రమోద్, చుక్కారపు అఖిలేష్, మొగుళ్ల రాకేష్, పల్లపు మహేష్ (మల్లయ్య కుమారుడు), పల్లపు మహేష్ (రాములు కుమారుడు), తప్పేలా వంశీ ఉన్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న మరికొందరు నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఏసీపీ మాధవి తెలిపారు. కేసును వేగంగా ఛేదించిన జమ్మికుంట సీఐ రామకృష్ణగౌడ్, ఎస్‌ఐ రవి, హుజూరాబాద్ ఎస్‌ఐ రాధాకృష్ణ, చిట్టిబాబు ఐడి పార్టీ సిబ్బందిని ఏసీపీ మాధవి అభినందించారు.

# దళిత మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ ఆశయాలు యువతకు స్ఫూర్తి

- మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్



**జమ్మికుంట టౌన్ మే 22 (తెలంగాణ ముచ్చట్లు):** భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పాల్గొని భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత వైతాళికుడిగా పేరుగాంచిన భాగ్యరెడ్డి వర్మ సంఘ సంస్కర్తగా, ఆది ఆంధ్ర సభ స్థాపకుడిగా విశేష సేవలు అందించారని తెలిపారు. 1906 నుంచి 1933 మధ్య హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి వారి విద్యాభివృద్ధికి బలమైన పునాదులు వేసారని గుర్తుచేశారు. జగన్మిత్ర మండలి, మన్యసంఘం, సంఘసంస్కార నాటక మండలి, అహింసా సమాజం వంటి సంస్థలను ఏర్పాటు చేసి సామాజిక మార్పు కోసం కృషి చేశారని పేర్కొన్నారు. అలాంటి మహనీయుని జయంతిని అధికారికంగా నిర్వహించడం ఆనందకరమని తెలిపారు.

జయంతులు, వర్ధంతులు జరుపుకోవడమే కాకుండా యువత మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, కౌన్సిలర్లు కొలుగురి సురేష్, కూతడి తిరుపతి, శీలం శ్రీనివాస్, చందా రాజు, మేనేజర్ జి రాజిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆర్ఐ భాస్కర్, వాణి మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బాధ్యతారాహిత్యానికి నిలువెత్తు నిదర్శనం ఎల్కతుర్తి రహదారి

**ఎల్కతుర్తి, మే 22(తెలంగాణ ముచ్చట్లు)**



ఎల్కతుర్తి మండల కేంద్రంలోని చౌరస్తా మెయిన్ రోడ్డుపై జరుగుతున్న నిర్మాణ పనులు కాంట్రాక్టర్ల బాధ్యతారాహిత్యానికి నిలువెత్తు నిదర్శనంగా మారాయని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కనే ఉన్న బావికి ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకుండా పనులు పూర్తి చేయడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. కనీసం బావి చుట్టూ కంచె గాని, రక్షణ గోడ గాని నిర్మించకపోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

అదే రోడ్డులో వైన్స్ షాప్ సమీపంలో ఈ బావి ఉండటంతో రాత్రివేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. రోడ్డు మీదుగా వెళ్లే వాహనదారులు, పాదచారులు ప్రమాదవశాత్తు బావిలో పడే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సమీపంలో పాఠశాలలు ఉండటంతో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు తెలియక బావి దగ్గరకు వెళ్లినా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

